క్లుప్తంగా

సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి

మద్దికెర: జూన్ 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించే పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థులు సకాలంలో (ఉదయం 9 గంటలకల్లా) పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని చీఫ్ శ్రీనివాసులు, డిపార్ట్‌మెంటల్ అధికారి ఫరూక్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షా కేంద్రంలో మద్దికెర, ఎం.అగ్రహారం, పెరవలి గ్రామాలకు చెందిన 160 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్నారన్నారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

జయప్రదం చేయండి

చిప్పగిరి: ఈ నెల 1న పత్తికొండలో జరిగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతు భరోసా సభను జయప్రదం చేయాలని మండల ప్రజలకు ఎంపీపీ జూటూరు హేమలత పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో కనీ వినీ ఎరుగని రీతిలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారన్నారు. సీఎం సభకు మండలం నుంచి ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.వైఎస్సార్‌సీపీ నాయకులు మారయ్య తదితరులు ఉన్నారు.

ఆలయ శిఖర నిర్మాణానికి విరాళం



రూ.1.50 లక్షల విరాళం అందజేస్తున్న రుద్రగౌడ్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని సోగనూరు రోడ్డులో జమ్ములమ్మ ఆలయ గోపుర శిఖర నిర్మాణానికి రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్, సహకార సొసైటీ అధ్యక్షుడు పురుషోత్తంగౌడ్, ప్రముఖ వైద్యులు గౌడప్పగౌడ్ రూ.1.50 లక్షలను విరాళంగా ఆలయ ధర్మకర్త తట్టెబుడ్డప్పకు మంగళవారం అందజేశారు. ఇప్పటికే అమ్మవారి విగ్రహాన్ని వారు ఆలయానికి అందజేసినట్లు ధర్మకర్త తెలిపారు. అనంతరం దాతలను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు నీలకంఠప్ప, తట్టి అనీల్, తిమ్మప్ప, బండశ్రీనివాసులు, చాయ శ్రీనివాసులు,నాగరాజు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలతో విద్యార్థుల్లో ఉల్లాసం

ఎమ్మిగనూరుటౌన్: గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలతో విద్యార్థుల్లో విజ్ఞానంతో పాటు మానసికోల్లాసం, క్రీడా స్ఫూర్తిని కలుగుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రకాష్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక గ్రంథాలయాన్ని ఆయన సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. వేసవిలో విద్యార్థులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవడం పట్ల అభినందించారు. గ్రంథాలయాధికారి హరికృష్ణ పాల్గొన్నారు.

మామపై అల్లుడి దాడి

కృష్ణగిరి: మండల పరిధిలోని కటారుకొండ గ్రామానికి చెందిన వై.వీర దివాకర్‌పై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. దివాకర్ తన భార్య లక్ష్మీ మౌనికను గత కొంత కాలం నుంచి వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ విషయపై ఆమె తండ్రి దివాకర్‌ను హెచ్చరించడంతో ఆగ్రహించి కర్రతో దాడి చేసి గాయపరిచాడు. ఘటనపై భార్య లక్ష్మీ మౌనిక ఫిర్యాదు మేరకు భర్త దివాకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న ఎంపీటీసీలు

పత్తికొండ రూరల్: సీఎం జగనన్న నాలుగేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా స్థానిక శారద వృద్ధాశ్రమంలో పోచిమిరెడ్డి సేవాదళ్ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదానం ఏర్పాటుచేశారు. వృద్ధాశ్రమంలో ముందుగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఎంపీటీసీలు అనిత, సరోజ, దేవరగట్టు లక్ష్మీ, వార్డు మెంబర్లు సావిత్రి, నాగరాజు, నాయకులు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను పరిష్కరించండి

కృష్ణగిరి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న చెబుదాం' కార్యక్రమంలో ప్రజా సమస్యలపై వచ్చే వినతుల పట్ల అప్రమత్తంగా ఉండి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన పంచాయతీ కార్యదర్శులతో 'జగనన్నకు చెబుదాం' ద్వారా వచ్చిన వినతులపై సమీక్ష నిర్వహించారు. ప్రతి రోజు మూడుసార్లు ప్రతిఒక్కరు తన లాగిన్‌లో ఏవైనా వినతులు వచ్చాయా అని చూడాలన్నారు. వచ్చిన వాటిని సంబంధించిన వ్యక్తి వద్దకు వెళ్లి అతనితో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకసారి వచ్చిన సమస్య మరోమారు రాకుండా చూసుకోవాలని ఆయన తెలియజేశారు.

అభివృద్ధికి నిర్వచనం చెప్పిన వైఎస్సార్‌సీపీ

- చంద్రబాబు 14 ఏళ్లలో చేయలేనిది జగన్ నాలుగేళ్లలో చేసి చూపించారు.
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి
- పట్టణంలో వైఎస్ విగ్రహానికి నివాళులు, ఆస్పత్రిలో రోగులకు పాలు, బ్రెడ్ పంపిణీ



కేక్ కట్ చేసి ఎర్రకోట జగన్‌కు తినిపిస్తున్న బీవై రామయ్య

ఎమ్మిగనూరుటౌన్: ఫార్టీ ఇయర్స్ పాలిటిక్స్, ఫోర్టీన్ ఇయర్స్ సీఎంగా చెప్పుకునే చంద్రబాబు చేయలేని అభివృద్ధి, సంక్షేమాన్ని కేవలం నాలుగేళ్లలో సీఎం వైఎస్ జగన్ చేసి చూపించారని వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం పట్టణంలో పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. స్థానికంగా ఉన్న దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి బీవై రామయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్ పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజల కష్టాలను ప్రజాసంకల్ప యాత్ర ద్వారా తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే మేనిఫెస్టోను పూర్తిగా అమలు చేశారన్నారు. 98.5 శాతం హామీలను అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలుచేసేందుకు సచివాలయ వ్యవస్థతో పాటు వలంటీర్లను నియమించి నవరత్నాల ద్వారా అన్ని వర్గాలకు పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించారని గుర్తుచేశారు. విద్య, వైద్యానికి ప్రాధాన్యతనిచ్చి వసతులు కల్పించడంతో ఆయా రంగాల్లో దేశంలోనే ఆదర్శంగా నిలిచామన్నారు. అమరావతితో పాటు రాష్ట్రవ్యాప్తంగా పేదలకు నివాస స్థలాలు ఇచ్చి పక్కా ఇళ్లను నిర్మిస్తుంటే వాటిని ప్రతిపక్ష నేత చంద్రబాబు శ్మశానాలతో పోల్చడం ఎంతవరకు సబబన్నారు. 14 ఏళ్ల పాలనలో ఏ ఒక్క హామీని అమలు చేయని టీడీపీ ఇప్పుడు మహానాడులో వైఎస్సార్‌సీపీ పథకాలను కాపీ కొట్టి అమలు చేస్తామని ప్రగల్భాలు పలికితే ప్రజలు ఎలా నమ్ముతారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ పాలనలో దాదాపు హామీలన్నీ అమలు చేయడంతో రాష్ట్రంలో మొత్తం 175 అసెంబ్లీ సీట్లన్నీ గెలుపొందటం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, ఎంపీపీ కేశన్న, మున్సిపల్ వైస్ చైర్మన్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

నజీర్‌అహమ్మద్, జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, పార్టీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బుట్టారంగయ్య, వీరేంద్ర, అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, సీనియర్ నాయకులు లక్ష్మికాంతరెడ్డి, శివప్పగౌడ్, భీమిరెడ్డి, పేట శ్రీనివాసరెడ్డి, షబ్బీర్‌అహమ్మద్, యుకె రాజశేఖర్, ప్రశాంత్‌తో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

జనం మెచ్చిన జగనన్న పాలన



కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, పార్టీ శ్రేణులు

- వైఎస్సార్‌సీపీ పాలనకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సంబరాలు
- పత్తికొండలో మోటార్ బైక్ ర్యాలీ
- కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్న పార్టీ శ్రేణులు

పత్తికొండటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనకు రాష్ట్ర ప్రజలు నీరాజనం పలుకుతున్నారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధించి, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టి 4 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం పత్తికొండలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆధ్వర్యంలో పార్టీశ్రేణులు సంబరాలను జరుపుకున్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద బైక్ ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. పత్తికొండ, తుగ్గలి, మద్దికెర మండలాల నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. జై జగన్, జైజై జగన్, జగనన్న నాయకత్వం వర్ధిల్లాలి, వైఎస్సార్‌సీపీ జిందాబాద్ అని నినాదాలు చేసుకుంటూ పట్టణంలోని ప్రధాన రహదారి వెంట పాతబస్టాండు అంబేడ్కర్ సర్కిల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే పార్టీశ్రేణుల సమక్షంలో కేక్ కట్‌చేసి, సంబరాలు జరుపుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీల్లో 4 ఏళ్లలోపే 98.6 శాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. అన్ని వర్గాల సంక్షేమం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమైందని వివరించారు. రాష్ట్రంలో ఎక్కడకు వెళ్లినా సీఎం జగనన్నకు ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారన్నారు. మాజీ ఎంపీపీ ఎస్.నాగరత్నమ్మ, వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్ పక్కీరప్ప, ఎంపీపీ నారాయణదాసు, జడ్పీటీసీ సభ్యులు పులికొండ, మురళీధర్‌రెడ్డి, సర్పంచులు శ్రీరాములు, రహిమాన్, అంజినయ్య, నాగప్ప, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో..

జననేత జగనన్న వెంటే జనం ఉన్నారని, ప్రజారంజక పాలన సాగిస్తున్న వైఎస్సార్‌సీపీకి రాబోయే ఎన్నికల్లో మళ్లీ పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసి 4ఏళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం పత్తికొండలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్నాల పథకాలను అర్హులైన లబ్ధిదారులందరికీ అందిస్తూ ప్రజా సంక్షేమంలో ఇతర రాష్ట్రాలకు ఏపీ ఆదర్శంగా నిలిపారని కొనియాడారు. అలాగే జూన్ 1న పత్తికొండలో సీఎం జగనన్న పాల్గొననున్న రైతు భరోసా సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధే లక్ష్యం



21వ వార్డులో బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎర్రకోట జగన్, కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి సారథ్యంలో పట్టణాభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 21వ వార్డు హెచ్‌బీఎస్ కాలనీ ఎల్ఐసీ ఆఫీస్ వైపు శిథిలమైన రోడ్డు స్థానంలో రూ.53 లక్షల మున్సిపల్ సాధరణ నిధులతో బీటీ రోడ్డు నిర్మాణానికి మంగళవారం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డిలతో కలిసి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ప్రజలకు అవసరమైన ప్రాంతాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. పట్టణంలో ఇప్పటికే ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని మరిన్ని పనులు ప్రారంభమయ్యాయని వాటిని నిర్ణీత గడువులోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లు వార్డు ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత: గోనెగండ్ల మండల పరిధిలోని వేముగోడు గ్రామానికి చెందిన కాప కృష్ణారెడ్డికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.65 వేల చెక్కును వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి అందజేశారు.

చుక్కల భూముల రైతులకు లబ్ధి

తుగ్గలి: మండలంలోని ముక్కెల్ల రెవెన్యూ పరిధిలో చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి ప్రభుత్వం తొలగించడంతో ఏడుగురు రైతులకు లబ్ధి చేకూరిందని తహసీల్దార్ రవి మంగళవారం తెలిపారు. ఏడుగురు రైతులకు చెందిన 12.95 ఎకరాల చుక్కల భూముల నిషేధిత జాబితా నుంచి తొలగించామన్నారు. సంబంధిత రైతుల భూములను ఆన్‌లైన్ నమోదు చేస్తామన్నారు. లబ్ధిపొందిన రైతులకు త్వరలో పత్రాలు అందజేస్తామని చెప్పారు.

గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ సేవలు

తుగ్గలి: ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామీణ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, ప్రజలు ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నామని పగిడిరాయి పీహెచ్‌సీ వైద్యాధికారి మినాజ్‌పాషా అన్నారు. మంగళవారం కడమకుంట్ల, లంకాయపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఎండతీవ్రత ఎక్కువగా నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 104 వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి పింఛన్ల పంపిణీ

తుగ్గలి: మండల వ్యాప్తంగా గురువారం నుంచి వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ చేయనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వీర్రాజు తెలిపారు. మండలంలోని 18 సచివాలయాల పరిధిలో 7,585 మంది పింఛన్‌దారులకు పంపిణీ చేసేందుకు రూ.2,09,92,500 నగదు మంజూరైందన్నారు. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ సొమ్ము అందిస్తారన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు బంగిశ్రీధర్ కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉద్యోగుల సమస్యలపై ఆ సంఘం ఆధ్వర్యంలో నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సత్వరం పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సంఘ తాలుకా అధ్యక్షులు వేణుగోపాలాచారి, సంఘ నాయకులు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోరే ప్రభుత్వం

ఆలూరు: వైఎస్సార్‌సీపీ ప్రజా సంక్షేమం కోరే ప్రభుత్వం అని దేవనకొండ మండలం సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, తెర్నెకల్ సర్పంచ్ అరుణ కుమార్ అన్నారు. తెర్నెకల్ గ్రామ పంచాయతీ కార్యలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. జూన్ 1వతేదీన సీఎం పత్తికొండ పర్యటనను అభిమానులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, రైతులు పాదుపు మహిళలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

గోనెగండ్ల: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్ సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల్లో వెనుకబడిన కాలనీలను అధికారులు సందర్శించాలన్నారు. ఇళ్లు కట్టుకోకపోవడానికి గల కారణాలను తెలుసుకొని లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించి త్వరితగతిన నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వం బిల్లులు సకాలంలో మంజూరు చేస్తుందన్నారు. ఇళ్లు కట్టుకోవడానికి ముందుకు రాని లబ్ధిదారులకు చివరి అవకాశం కింద తహసీల్దార్ సహకారంతో నోటీస్ అందజేయాలన్నారు. హౌసింగ్ ఏఈ లక్ష్మన్న, సూపరింటెండెంట్ బాబు భాస్కర్, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఎమ్మిగనూరురూరల్: పత్తి పంట సాగులో సమగ్ర సస్యరక్షణ యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చునని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ కె.లక్ష్మన్న, రిలయన్స్ ఫౌండేషన్ డీపీఎం కుమారస్వామిరెడ్డి సూచించారు. మంగళవారం బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో పత్తి పంట సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పత్తి పంటను జూన్‌లో కాకుండా ముందస్తుగా నాటితే ఎర్ర తెగులు సోకే అవకాశం ఉందని చెప్పారు. విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు పాటించాలని, భూసార పరీక్షలు చేయించుకుని ఫలితాల అనుగుణంగా ఎరువులు వాడాలని సూచించారు. విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలని, అంతర పంటల ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశం ఉంటుందని వివరించారు. పంటల సాగులో ఏమైనా సందేహాలుంటే కేవీకే శాస్త్రవేత్తలను సంప్రదించవచ్చని సూచించారు. కేవీకే శాస్త్రవేత్తలు పి.అపర్ణ, మహదేవయ్య, రిలయన్స్ ప్రతినిధులు రేఖారెడ్డి, అపార్డ్ సంస్థ సిబ్బంది వీరేష్, వెంకప్ప, రైతులు పాల్గొన్నారు.

పత్తికొండలో సబ్‌కోర్టు ఏర్పాటుచేయాలి

పత్తికొండటౌన్: రెవెన్యూ డివిజన్ కేంద్రం పత్తికొండలో సీనియర్ సివిల్ జడ్జి (సబ్ కోర్టు) ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి బి.రంగస్వామి, సీనియర్ న్యాయవాది పి.ఎల్లారెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులు సమావేశమై ఈ విషయంపై చర్చించారు. జూన్ 1న పత్తికొండ పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసి సబ్ కోర్టు ఏర్పాటుపై వినతిపత్రం అందజేయాలని తీర్మానించారు. వారు మాట్లాడుతూ పత్తికొండలో ప్రస్తుతం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మాత్రమే ఉందన్నారు. రెవెన్యూ డివిజన్, పోలీసు సబ్‌డివిజన్ ఏర్పాటైనందున పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల పరిధిలోని 12 పోలీస్‌స్టేషన్లు ఈ పరిధిలోకి వచ్చేలా సబ్ కోర్టు ఏర్పాటుచేస్తే కక్షిదారులు, న్యాయవాదులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. బార్‌అసోసియేషన్ ఉపాధ్యక్షుడు దామోదరాచారి, క్రీడా కార్యదర్శి సోమప్ప, కోశాధికారి మహేశ్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆహ్లాదం.. ఆధ్యాత్మికం.. వెల్దుర్తి రక్షక భట నిలయం

వెల్దుర్తి: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణ పచ్చటి చెట్లతో, వాకింగ్ ట్రాక్‌తో, సుంకులమ్మ కట్టతో ఆహ్లాదం, ఆరోగ్యం అందిస్తూ ఆధ్యాత్మికత నింపుతోంది. 2004లో అప్పటి ఎస్‌ఐ రామయ్యనాయుడు స్టేషన్ ఎదుట పచ్చదనానికి బీజం వేసి మొక్కలు నాటించారు. అవి ఇప్పుడు పెద్దగాపెరిగి పార్కును తలపిస్తున్నాయి. 2017–18లో ఎస్‌ఐ నరసింహులు స్టేషన్ కుడి, ఎడమ వైపు ప్రాంతంలో లక్షలాది రూపాయల ఖర్చుతో నేలను చదును చేయించి, పిచ్చి మొక్కలు, అపరిశుభ్రతను తొలగించి, డ్రిప్ సిస్టమ్ ఏర్పాటు చేసి వందలాది మొక్కలు నాటించడంతో పాటు 1200 మీటర్ల వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. మొక్కలు నేడు పెరిగి నీడను, ఆహ్లాదాన్నిస్తుండగా, వాకింగ్ ట్రాక్ ఉదయం, సాయంత్రం పట్టణ ప్రజలకు నడక, వ్యాయామానికి సౌకర్యంగా ఉంటూ ఆరోగ్యాన్నిస్తోంది. అదే సమయంలో పురాతన సుంకులమ్మ కట్టను ఆధునీకరించడంతో భక్తుల రాక పెరిగింది. ప్రస్తుత ఎస్‌ఐ ఆధ్వర్యంలో ఇటీవల సుంకులమ్మ కట్ట వద్ద భక్తుల సహకారంతో నీళ్ల ట్యాంకు, సరఫరా ఏర్పాటు చేశారు. సీఐ యుగంధర్, ఎస్ చంద్రశేఖర్ రెడ్డి బృందం సొంత ఖర్చులతో పురాతన నాగులకట్టను ఆధునీకరించి, పునఃప్రతిష్ఠ కార్యక్రమాలకు పూనుకున్నారు. 6 ఎకరాల విస్తీర్ణం గల పోలీస్‌స్టేషన్‌లో అన్ని సౌకర్యాలు కల్పించడంపై ప్రశంసలు లభిస్తున్నాయి.



పచ్చని చెట్లతో వెల్దుర్తి పోలీస్‌స్టేషన్

నేడు నాగదేవత విగ్రహాల పునఃప్రతిష్ఠ

స్టేషన్ ఆవరణలోని పురాతన నాగుల కట్ట వద్ద విగ్రహాలకు పట్టణంలోని భక్తులు చవితి, పండుగ రోజులలో పూజలు నిర్వహిస్తుంటారు. ఆ విగ్రహాలు శిథిలావస్థకు చేరుతుండడంతో సీఐ యుగంధర్, ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి బృందం విగ్రహాల పునఃప్రతిష్ఠకు అవసరమైన భూమిని అభివృద్ధి పరిచి, చుట్టూ కాంపౌండ్, గేటు ఏర్పాటు చేశారు. శాస్త్రబద్ధంగా పండితులు శ్రీధర్‌శర్మ బృందం ఆధ్వర్యంలో రెండ్రోజులు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగనున్నాయి. సీఐ యుగంధర్ కుటుంబ సభ్యులు, పోలీసుల సమక్షంలో ప్రారంభ



స్టేషన్ ఆవరణలో సుంకులమ్మ కట్ట (గుడి)

రోజు యాగశాల ప్రవేశం, గణపతి, గోపూజ నిర్వహించారు. మంగళవారం పలు ప్రతిష్ఠ కార్యక్రమాలు జరిగాయి. బుధవారం ఉదయం 9.15 గంటల తర్వాత విగ్రహాలప్రతిష్ఠ చేపట్టనున్నట్లు సీఐ, ఎస్‌ఐ తెలిపారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందని, భక్తులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం



మాట్లాడుతున్న చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ పరిధిలో పలు వార్డుల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. టేబుల్ అజెండాలో.. 28వ వార్డులో సీసీ, గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షలు, 27వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.24.50లక్షలు సాధారణ నిధుల నుంచి మంజూరు చేసేందుకు సభ్యులు ఆమోదించారు. మున్సిపాలిటీ షాపుల రెన్యూవల్‌కు సంబంధించి లీజుదారులు మూడు నెలల అడ్వాన్స్ ప్రస్తుతం చెల్లించినందున గతంలో చెల్లించిన సంవత్సర అడ్వాన్స్‌లో మిగిలిన మొత్తం వారికి చెల్లించేలా తీర్మానించారు. 6వ వార్డు సచివాలయం నుంచి 10వ వార్డు సచివాలయం వరకు, 16వ సచివాలయం నుంచి 20వ సచివాలయం వరకు సీసీ, బీటీ రోడ్డు ప్యాచులు వేసేందుకు ఆమోదం తెలిపారు. 6వ వార్డులోని సోగనూరు బీటీ రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్ పనులు, 2వ వార్డులో రూ.2 లక్షలతో నాన్‌రొట్టి గుర్రప్ప ఇంటి దగ్గరలో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి, పాత టౌన్‌బ్యాంక్ వద్ద గడప గడపకు మన ప్రభుత్వం నిధుల నుంచి రూ.10లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు పలు వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు సాధారణ నిధులు కేటాయించేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. పట్టణంలోని 21వ వార్డులో రోడ్డు పనులు ప్రారంభించినందున ప్రతిపక్ష కౌన్సిలర్ దయాసాగర్ కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల కుక్కల దాడిలో చిన్నారి గాయపడిందని, వీధి కుక్కలను నియంత్రించాలని సభ్యులు కోరారు. వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డీఈ, మనోహర్‌రెడ్డి, ఏఈ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, టీపీఓ గోపాలకృష్ణ, కోఆప్షన్‌మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలు మంజూరు

హొళగుంద: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సబ్సిడీ వేరుశనగ విత్తనాలు మంజూరైనట్లు వ్యవసాయాధికారి నరేంద్రకుమార్ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఆయా రైతు భరోసా కేంద్రాలో రిజిస్ట్రేషన్, పంపిణీ కార్యక్రమం కొనసాగుతున్నట్లు ఆయన వెల్లడించారు. మండలానికి ప్రస్తుతం 150 క్వింటాళ్లు విత్తనాలు మంజూరయ్యాయని, డిమాండ్‌ను బట్టి మరింత స్టాకు వస్తుందన్నారు. క్వింటాల్ వేరుశనగ విత్తనకాయల ధర మార్కెట్‌లో రూ.9,300 ఉండగా 40 శాతం సబ్సిడీ పోనూ రైతులకు రూ.5,580కు అందజేస్తామన్నారు. ఒక రైతుకు గరిష్టంగా మూడు బస్తాలు (బస్తా 30 కేజీలు ప్రకారం) మాత్రమే ఇస్తామన్నారు. అలాగే పిల్లిపెసర 25 క్వింటాళ్లు, దయాంచ 85 క్వింటాళ్లు మంజూరయ్యాయని 50 శాతం సబ్సిడీతో పిల్లి పెసర క్వింటాల్ పిల్లిపెసర రూ.4,850, దయాంచ రూ.3,950 ప్రకారం అందజేస్తామని తెలిపారు.

ప్రాథమిక హక్కులపై అవగాహన

తుగ్గలి: పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం తుగ్గలి ఎస్సీ కాలనీలో అధికారులు సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. రాజ్యాంగం ప్రసాదించిన చట్టాలు, పౌర హక్కులపై తహసీల్దార్ రవి, ఎస్‌ఐ మల్లికార్జున ప్రజలకు అవగాహన కల్పించారు.ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆర్‌ఐ సుధాకరరెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

కృష్ణగిరి: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగినప్పుడే గ్రామాలు ప్రశాంతంగా ఉంటాయని ఆర్‌ఐ మస్తాన్ అన్నారు. చుంచుఎర్రగుడి గ్రామ ఎస్సీ కాలనీలో మంగళవారం సాయంత్రం జరిగిన పౌరహక్కుల సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో అంటరానితనం పోవాలంటే ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని విజ్ఞప్తి చేశారు.

దళిత కాలనీలో సమస్యలను స్థానికులు ప్రస్తావించగా పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

సీఎం సభకు తరలిరండి

వెల్దుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పత్తికొండలో జూన్ 1న నిర్వహించే రైతు భరోసా సభకు జిల్లా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తరలిరావాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. సీఎం సభకు అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, నాయకులు ఇప్పటికే ఏర్పాటు పూర్తి చేశారన్నారు. పత్తికొండలోని సెయింట్ జోసెఫ్ పాఠశాల మైదానంలో సీఎం భారీ బహిరంగ సభ ఉంటుందని, ఉదయం 10 గంటలలోపు అందరూ సభకు చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మిగనూరురూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న నవరత్నాల పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన మంగళవారం సాయంత్రం కందనాతి గ్రామ వీధుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ముందుగా గ్రామంలో శ్రీ మారెమ్మవ్వను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ నాలుగేళ్లుగా అందిస్తున్న పథకాలు, సేవలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఎంపీపీ గొల్ల కేశన్న, నాయకులు రామకృష్ణారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, బొడ్డన్న, ప్రసాద్ పాల్గొన్నారు.

వలంటీర్లకు సత్కారం

హొళగుంద: ఎల్లార్తి గ్రామ సచివాలయంలో సేవామిత్ర అవార్డులు పొందిన వలంటీర్లను సర్పంచ్ కురువ చాముండేశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. వక్తలు మాట్లాడుతూ వలంటీర్ల సేవలను కొనియాడారు. నిజాయితీతో సేవలందిస్తున్న వలంటీర్లను సత్కరించి సముచిత గౌరవం ఇవ్వడం అందరి బాధ్యత అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్కే గిరి, ఎంఎల్‌హెచ్‌పీ నీరజ్, సచివాలయ సిబ్బంది కుషానాయక్, శివరాజునాయక్, రాజేశ్వరి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన

నందవరం: మండల పరిధిలోని మాచాపురం గ్రామంలో మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 12వ ఆరాధన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి ఆలయంలో స్వామి వారికి కుంకుమార్చన, పాలాభిషేకం, ఆకుపూజలు, గణపతి పూజలు, మహా మంగళ హారతులు గావించి విశేష పూజలు చేపట్టారు. అనంతరం స్వామి వారి చిత్ర పటాన్ని పురవీధుల గుండా ఊరేగించారు. బాలికలు కలశాలతో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తాదులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దేవనకొండ: మండలంలోని ఈరంపల్లి గ్రామ సమీపంలో ఎదురెదురుగా వచ్చిన రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గోనెగండ్ల మండలం హెచ్. కైరవాడి గ్రామానికి చెందిన వడ్డె దండగల రాజశేఖర్ (29) ఏపీ 21 ఏఆర్ 0518 బైక్‌పై దేవనకొండ గ్రామం వైపు వెళుతున్నాడు. ఎదురుగా ఎక్స్‌ఎల్ వాహనంపై బాలకంప రాంబాబు మాచాపురం గ్రామం నుంచి కోడుమూరుకు వెళుతున్నాడు. ఈరంపల్లి గ్రామం సమీపంలో రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. రాజశేఖర్ పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందారు.